
సాక్షి బాపట్ల

శుక్రవారం । 17 । మే । 2024



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: సాగర్ జలాశయ నీటి మట్టం గురువారం 504.80 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 400 క్యూసెక్కులు విడుదలవుతోంది.



అంకమ్మ కొలుపులు ప్రారంభం

భట్టిప్రోలు : కోనేటిపురం పంచాయతీ పరిధిలోని జంపనివారిపాలెంలో అంకమ్మ కొలుపులు గురువారం ప్రారంభమయ్యాయి. జూన్ 14న నెల నంబరం నిర్వహిస్తారు.

గురుపూజ మహోత్సవం



పొన్నూరు: నిడుబ్రోలు ఆలూరు రోడ్డులోని జగద్గురు ఆది కాలజ్ఞానకర్త శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో గురువారం 25వ ఆరాధన గురుపూజ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

న్యూస్‌రీల్

స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్

నరసరావుపేటరూరల్: కాకాని జేఎన్‌టీయూఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్‌రూమ్‌ను జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి గురువారం పరిశీలించారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు చెందిన ఈవీఎం యంత్రాలను ఇక్కడే స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచారు. స్ట్రాంగ్‌రూమ్ వద్ద భద్రతను పరిశీలించి సూచనలు చేశారు. స్ట్రాంగ్‌రూమ్ వద్ద పటిష్ట భద్రతా చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ తెలిపారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి గుంటూరుకు చెందిన భక్తులు గురువారం రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. తుళ్లూరు మండలం నెక్కల్లుకు చెందిన ఆర్.కోటి సుధాకర్ కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి వచ్చింది. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ.1,01,116 విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించగా, వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. ఆలయ అధికారి రమేష్ దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలు బహూకరించారు.

కూల్‌డ్రింక్ షాపు దహనం



నరసరావుపేటరూరల్: వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడికి చెందిన కూల్‌డ్రింక్ షాపును బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. బాధితుడు తెలిపిన వివరాలు మండలంలోని పాలపాడుకు చెందిన పచ్చి సురేష్ పాలపాడు రోడ్డులో కూల్‌డ్రింక్ షాపు నిర్వహిస్తున్నాడు. బుధవారం అర్ధరాత్రి దుకాణంపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టడంతో పూర్తిగా దగ్ధమయింది. దుకాణంలోని రెండు ఫ్రిజ్‌లతోపాటు సామగ్రి పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. రూరల్ ఎస్ఐ బాలకృష్ణ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుడి నుంచి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ పోలీసులు తెలిపారు.

దోమల నివారణ, నియంత్రణ అందరి బాధ్యత

పల్నాడు డీఎంహెచ్‌వో డాక్టర్ రవి



నరసరావుపేట: దోమల నివారణ, నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత కావాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి పేర్కొన్నారు. గురువారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా పల్నాడు రోడ్డులోని జిల్లా కార్యాలయ ఆవరణలో ఆశాలు, ఏఎన్ఎంలతో ర్యాలీ చేసి ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉంచకుండా చేసుకోవటం ద్వారా చికెన్‌గున్యా, డెంగీ, మలేరియా, ఫైలేరియా, మెదడువాపు లాంటి జబ్బులను నివారించవచ్చన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడుతూ పొడవాటి దుస్తులు ధరించటం, మస్కిటో రెఫెల్లెంట్లు వాడటం ద్వారా దోమలను నివారించవచ్చు అన్నారు. ఈసందర్భంగా నిర్వహించిన ర్యాలీలో చిన్న దోమ-పెనుప్రమాదం, దోమ పుట్టరాదు-కుట్టరాదు, దోమతెరలు వాడండి-దోమకాటును నివారించండి, చేయి చేయి కలుపుదాం-డెంగీ వ్యాధిని నివారిద్దాం, నీటి తెట్టపై మూత-దోమల పెరుగుదలకు కోత అనే ప్లకార్డులను ప్రదర్శిస్తూ కొనసాగారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రత్నాకరం రాము, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లేడీస్ ఫస్ట్

లేచింది మహిళాలోకం



ఆకాశంలో సగంమైన మహిళలు నేడు అన్ని రంగాల్లోనూ పురుషులతో పోటీ పడుతున్నారు. మహిళా చైతన్యం వంటిల్లు దాటి, గడపదాటి విశ్వవ్యాప్తమైంది. అన్ని చోట్ల 'ఆమె' ఉనికి చాటుకుంటోంది. జిల్లావ్యాప్తంగా సంఖ్యలోనూ పురుషులను దాటిపోయారు. ఇటీవల ఎన్నికల్లోనూ మహిళల చైతన్యం వెల్లివిరిసింది. పల్లె , పట్టణం అనే తేడా లేకుండా కదలివచ్చి ఎన్నికల క్రతువులో ఉత్సాహంగా పాల్గొన్నారు. జగనన్న ఇచ్చిన ఆర్థిక భరోసాతో, ధీమాతో ఓటేసి తోడబుట్టిన రుణం తీర్చుకున్నారు. రానున్న ఎన్నికల ఫలితాలు కూడా దీన్నే ప్రతిబింపజేయనున్నాయి.

- పెరిగిన గ్రామీణ మహిళల ఓటింగ్
- జిల్లావ్యాప్తంగా ఇదే పోలింగ్ సరళి
- పట్టణాలతో పోలిస్తే పల్లెల్లో 15 శాతం పెరిగిన పోలింగ్
- జిల్లాలో పురుషుల కంటే 22,835 మహిళలు అధికం
- అధికార పార్టీకి అనుకూలంగా మహిళల ఓటింగ్
- గెలుపు తమదేనంటున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



అనంతవరంలో ఎండలో సైతం బారులుదీరిన ఓటర్లు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: జిల్లావ్యాప్తంగా ఈ నెల 13న ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో మహిళలు ఓటుహక్కును అధికంగా ఉపయోగించుకున్నారు. పురుషులతో పోలిస్తే ఓట్లు అధికంగా నమోదయ్యాయి. ఉదయం ఆరు గంటల నుంచే క్యూలైన్లలో నిలబడి ఓట్లు వేశారు. పోలింగ్ సందర్భంగా మహిళల్లో చైతన్యం కనిపించింది. ఓటు వేయాలన్న ఉత్సాహం వారిలో వ్యక్తమైంది. దీంతో అన్ని పనులు వదలిపెట్టి పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చారు. పురుషులతో పోలిస్తే మహిళల ఓట్లు అధికంగా నమోదయ్యాయి. జిల్లాలో మొత్తం 12,91,716 ఓట్లు ఉండగా 16,767 పోస్టల్ బాలెట్లతో కలిపి 11,16,750 ఓట్లు (86.45 శాతం) పోలయ్యాయి. ఇందులో 5,38,553 పురుషులు ఓట్లు కాగా 5,61,389 మహిళా ఓట్లు ఉన్నాయి. పురుషులతో పోలిస్తే జిల్లావ్యాప్తంగా 22,836 మహిళల ఓట్లు అధికంగా పోల్ కావడం గమనార్హం.

పర్చూరు అత్యధికం

అత్యధికంగా పర్చూరు నియోజకవర్గంలో 4213 మహిళా ఓట్లు అధికంగా పోల్ అయ్యాయి. బాపట్లలో 3981, అద్దంకిలో 3936, చీరాలలో 3905, వేమూరులో 3844, రేపల్లెలో 2957 ఓట్లు అధికంగా నమోదయ్యాయి. బాపట్లతో పాటు వేమూరు, రేపల్లె, చీరాల, పర్చూరు, అద్దంకి సహా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇదే విధంగా నమోదయ్యాయి.మహిళల ఓట్లు అధికంగా నమోదు కావడం అధికార పార్టీకి కలిసి వచ్చే అంశమని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో అన్ని సంక్షేమ, అభివృద్ధి పథకాలు మహిళల పేరున అందజేసింది. వారి ఆర్థిక ఎదుగుదలకు కృషి చేసింది. ఇవన్నీ మరువని మహిళలు ఈ ఎన్నికల్లో ఓట్లు వేశారని, దీంతో గెలుపు తమదేనని అధికారపార్టీ నేతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామీణ ఓటర్లదే ఆధిపత్యం

గత ఎన్నికలతో పోలిస్తే అర్బన్ పోల్ పర్సెంటేజీ కొంత పెరిగినా గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే తక్కువగా నమోదైంది. ఉదాహరణకు జిల్లా కేంద్రమైన బాపట్ల పట్టణంలో 73.92 శాతం పోలింగ్ నమోదు కాగా బాపట్ల రూరల్ మండలంలో 87.44శాతం, కర్లపాలెం మండలంలో 87. 60 శాతం, పిట్టలవానిపాలెం మండలంలో 85. 65 శాతం పోలింగ్ నమోదైంది. ఈ లెక్కన పట్టణ ప్రాంతంతో పోలిస్తే గ్రామీణ ప్రాంతంలో 12 నుంచి15 శాతం వరకు అధికంగా పోలింగ్ నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇక జిల్లాలో అన్ని పట్టణాల పరిధిలో కంటే గ్రామీణ ప్రాంతాల పోలింగ్ సగటున 15 శాతానికి పైనే నమోదైంది. ఇది అధికారపార్టీకి మరింతగా కలిసిరానుంది. ఈ ఓట్లతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయకేతనం ఎగురవేయడం ఖాయమని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

జిల్లాలో మహిళా ఓటింగ్ సరళి

నియోజకవర్గం	పురుషులు,	స్త్రీలు,	మెజార్టీ స్త్రీల ఓట్లు
వేమూరు	83,404	87,248	3,844
రేపల్లె	92385	95342	2957
బాపట్ల	77251	81232	3981
పర్చూరు	98025	102238	4213
అద్దంకి	105 718	109 654	3936
చీరాల	81770	85675	3905
	5,38,553	5,61,389	22836

అ..ధిక్కారులపై ఈసీ చర్యలు

- పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ బదిలీ
- ఎస్పీ బిందుమాధవ్ సస్పెన్షన్
- కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు

నరసరావుపేట: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పల్నాడు జిల్లాలో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలపై కేంద్ర ఎన్నికల సంఘం సీరియస్ అయింది. దీనికి బాధ్యులుగా పరిగణిస్తూ కలెక్టర్ ఎల్.శివశంకర్‌ను బదిలీ, ఎస్పీ జి.బిందుమాధవ్‌ను సస్పెండ్ చేస్తూ గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. శాంతిభద్రతలు అదుపుతప్పడంపై విచారణకు ఆదేశించింది. కలెక్టర్ శివశంకర్ రెండేళ్ల నుంచి జిల్లాలో పని చేస్తుండగా ఎన్నికలకు ముందే ఈసీ నియమించిన బిందుమాధవ్ అప్పుడే సస్పెండ్ కావటం గమనార్హం. ఎన్నికల ముందు వరకు సమర్థంగా జిల్లాను నడిపించిన ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డిని టీడీపీ నాయకుల ఫిర్యాదు మేరకు ఈసీ తప్పించింది. బిందుమాధవ్‌ను ఎస్పీగా నియమించింది. పోలింగ్ రోజున మాచర్ల, గురజాల, నరసరావుపేట, సత్తెనపల్లి నియోజకవర్గాల్లో టీడీపీ నాయకులు యథేచ్ఛగా హింసాత్మక ఘటనలకు పాల్పడుతున్నా నిలువరించలేకపోవటం, వైఎస్సార్ సీపీ అభ్యర్థులు చేసిన ఫోన్‌లకు కలెక్టర్, ఎస్పీ స్పందించలేదనే విమర్శలు ఈసీ వరకు వెళ్లాయి. దీంతో చర్యలకు ఉపక్రమించింది.

అధికారయంత్రాంగం పూర్తిగా విఫలం

పల్నాడు జిల్లాలో ఎన్నికలను సజావుగా నిర్వహించడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిపై టీడీపీ వర్గీయులు దాడి చేయటంపై ఎమ్మెల్యేతోపాటు ఎంపీ అభ్యర్థి డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్ పలుమార్లు కలెక్టర్, ఎస్పీలకు ఫోన్ చేసినా స్పందించలేదు. టీడీపీ నాయకులపై ఉదారంగా వ్యవహరించటంతో వారు రెచ్చిపోయి హింసాత్మక ఘటనలకు పాల్పడ్డారు. నరసరావుపేటలోని మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రం ఏజెంట్లుగా కూర్చున్న వైఎస్సార్ సీపీ నాయకులపై టీడీపీ అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, అతని అనుయాయులు దాడిచేసి బయటకు లాగి కొట్టినా పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో ఆ సమీపంలో ఉన్న ఎమ్మెల్యే డ్రైవర్‌ను టీడీపీ నేతలు చితక బాదారు. ఎమ్మెల్యే గోపిరెడ్డిని మధ్యాహ్నం రెండు గంటలకే హౌస్ అరెస్టుచేసిన పోలీసులు టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చదలవాడలు యథేచ్ఛగా పోలింగ్ కేంద్రాల్లోకి చొరబడినా చోద్యం చూస్తూ ఉండిపోయారు. మాచర్ల నియోజకవర్గంలో పోలీసులు మరీ విచ్చితంగా వ్యవహరించారు. సమస్యాత్మకంగా లేకపోయినా వైఎస్సార్ సీపీ సానుకూల గ్రామాలకు రెంటికి ప్రత్యేకంగా డీఎస్పీని నియమించి పోలింగ్ నిర్వహించారు. సమస్యాత్మక మండలంగా పేరుగాంచిన కారెంపూడి మండలంలో సరైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయలేదు. ఏడెనిమిది గ్రామాల్లో టీడీపీ నేతలు రిగ్గింగ్ చేసుకునేందుకు అవకాశం కల్పించారనే విమర్శలు పోలీసులపై వెల్లువెత్తాయి. ఎన్నికల మరుసటిరోజు గొడ్డళ్లు, రాడ్లు, మారణాయుధాలతో చుట్టుప్రక్కల గ్రామాల నుంచి పచ్చమూకలు కారెంపూడికి వచ్చి వైఎస్సార్ సీపీ వర్గీయులపై దాడులు చేస్తున్నా పోలీసులు నిలువరించలేకపోయారు. ఎన్నికల ప్రచారానికి వెళ్లిన మాచర్ల ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి భార్యపై దాడిని పోలీసులు ఆపలేకపోయారు. మంత్రి అంబటి రాంబాబుకు ఒక సీఐ రివాల్వర్ గురిపెట్టాడంటే ఆ ధైర్యం అతనికి ఎస్పీ నుంచే వచ్చిందనే వాదన వినపడుతోంది. గురజాలలోని కొత్తగణేశునిపాడులో బీసీ వర్గాలను పలుకరించేందుకు వెళ్లిన పి.అనిల్, కాసు మహేష్‌రెడ్డిలపై టీడీపీ వర్గీయులు దాడులకు తెగబడడం కూడా పోలీసుల ఉదాసీనతకు నిదర్శనంగా ఉంది. ఎన్నికలు ముగిసి నాలుగు రోజులు గడుస్తున్నా ఇంకా జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉండడం విస్మయం కలిగిస్తోంది. దీంతో వీటిన్నింటికీ కలెక్టర్, ఎస్పీలే బాధ్యులని నిర్ణయానికొచ్చిన ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంది. వీరితో పాటు గురజాల డీఎస్పీ పల్లపురాజు, నరసరావుపేట డీఎస్పీ వర్మ, ఇద్దరు స్పెషల్ బ్రాంచ్ సీఐలు, కారంపూడి, నాగార్జునసాగర్ ఎస్ఐలపైనా ఈసీ వేటు వేసింది.

డెంగీపై అప్రమత్తత అవసరం

డీఎంహెచ్‌వో విజయమ్మ



ప్రదర్శనను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో విజయమ్మ

బాపట్ల: డెంగీ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారిణి డాక్టరు విజయమ్మ సూచించారు. జాతీయ డెంగ్యూ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టరు విజయమ్మ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వ్యాధిని నివారించవచ్చని తెలిపారు. దోమల్ని అరికట్టాలని సూచించారు. ప్రతి శుక్రవారాన్ని డ్రై డేగా పాటిస్తూ, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ డిస్పోజబుల గ్లాసులను దూరంగా వేయాలని సూచించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి బి.వెంకటేశ్వర్లు, డాక్టర్ ప్రేమ్‌చంద్, డాక్టర్ బ్రహ్మానందం, మరియమ్మ పాల్గొన్నారు.

గ్రామాల్లో కొనసాగుతున్న పోలీస్ పికెట్లు

ఎస్పీ వకుల్ జిందాల్



వెస్ట్ పిన్నిబోయినవారిపాలెంలో పోలీస్ పికెట్

బాపట్ల టౌన్: జిల్లాలోని సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ పికెట్లు కొనసాగిస్తున్నామని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ ఎన్నికల రోజు, తర్వాత పరిణామాల్ని దృష్టిలో ఉంచుకొని జిల్లాలో పలుచోట్ల సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ పికెట్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆ ప్రాంతాల్లో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా శాంతిభద్రతల్ని పరిరక్షిస్తూ, ప్రజలకు రక్షణగా పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని వివరించారు. ప్రజలు కూడా సహనంతో మెలగాలని తెలిపారు. పికెట్లలో విధులు నిర్వహించే సిబ్బంది కూడా అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు.

వైఎస్సార్ సీపీకే ఓటర్ల మొగ్గు

- పోలింగ్ సరళిని బట్టి నేతల అంచనాలు
- వార్డు వారీగా పార్టీల నేతలతో అభ్యర్థుల చర్చలు
- గెలుపు ధీమాలో పార్టీ శ్రేణులు
- ఫలితాలు కోసం ఉత్కంఠగా ఎదురుచూపులు
- బాపట్ల జిల్లాలో 86.51 శాతం ఓటింగ్



చీరాలలోని పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

చీరాల: సార్వత్రిక ఎన్నికల్లో కీలకమైన పోలింగ్ ప్రక్రియ ముగిసింది. పోటీలో నిలిచిన అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమైంది. ఎన్నికల్లో ఆఖరి ఘట్టమైన ఓట్ల లెక్కింపు కోసం పార్టీల అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలతో పాటు ఓటర్లు కూడా ఎంతో ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఎన్నికలలో నియోజకవర్గం నుంచి ఏ అభ్యర్థి విజేతగా నిలుస్తారు ? రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందనే విషయం అందరిలో ఆసక్తిని రేకెత్తిస్తోంది.పలువురు వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమని ఢంకా బజాయించి చెబుతున్నారు.

అత్యధిక శాతం పోలింగ్ నమోదు

జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో 86.51 పోలింగ్ శాతం నమోదైంది. దీంతో అభ్యర్థులు వారి వారి అంచనాలు వేసుకుంటూ పార్టీ నేతలతో చర్చలు జరుపుతున్నారు. పోలింగ్ బూత్‌ల వారీగా నమోదైన శాతంపై ఆరా తీస్తున్నారు. ఈ ఎన్నికలలో జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో ప్రధాన రాజకీయ పార్టీల మధ్యనే పోరు నెలకొంది. దీంతో గెలుపోటములపై సర్వత్రా చర్చ జరుగుతోంది.

కాయ్ రాజా కాయ్

సార్వత్రిక ఎన్నికలో ప్రధాన రాజకీయ పార్టీలు మధ్య హోరాహోరీగా పోరు నడిచింది. జిల్లాలోని చీరాల, బాపట్ల, రేపల్లె, వేమూరు, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లో రాజకీయ పార్టీల అభ్యర్థులు అలుపెరగని ప్రచారాన్ని చేశారు. గెలుపు తమదంటే తమదే అన్నట్లుగా ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ సమయంలో కొంత మంది బెట్టింగ్‌లను చాపకింద నీరులా గుట్టుచప్పుడుగా నిర్వహిస్తున్నారు. ఐపీఎల్‌తో పాటు ఎన్నికల ఫలితాలపై కూడా బెట్టింగ్‌లు కాస్తున్నారు. సోషల్ మీడియాలో కూడా విస్తృతంగా ఎగ్జిట్ పోల్స్ ప్రకటిస్తున్నారు. దానిలో వచ్చిన తర్వాత చిన్న అంశం నుంచి జాతీయ, అంతర్జాతీయ అంశాలపై కూడా చర్చించడం సర్వసాధారణమైంది.

వైఎస్సార్ సీపీ నేతల ధీమా

అత్యంత కీలకమైన, ప్రతి ఒక్కరిని ప్రభావితం చేసే రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుపై కూడా చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో ఏ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందనే విషయంపై కూడా బెట్టింగ్ జరుగుతోంది. పోలింగ్ రోజు వరకు ఒక లెక్క అయితే.. పూర్తయిన తర్వాత మరో లెక్కన ఎవరి విశ్లేషణలు వారు చేస్తున్నారు. ఒక వైపు గత ఐదేళ్లలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో పూర్తిగా సఫలీకృతమైన వైఎస్సార్ సీపీ అభ్యర్థులు వారి గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ప్రతి పక్ష కూటమి అభ్యర్థులు కూడా తామే గెలుస్తామని మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారు. దీంతో రాజకీయ పార్టీల అభ్యర్థులు, నేతలు వారి వారి అంచనాలతో మునిగిపోయారు. ఎన్నికల ముందు ఒక పార్టీ నుంచి మరో పార్టీకి మారిన వారిపై కూడా చర్చ నడుస్తోంది. పోల్ మేనేజ్‌మెంట్ ఎంత వరకు సాధ్యపడిందో అంచనాలు వేస్తున్నారు.

రగిలిన పాత పగ

బాపట్లలో యువకుడి దారుణ హత్య

- మృతుడు నెల్లూరుకు చెందిన ప్రశాంత్‌గా గుర్తింపు
- పథకం ప్రకారమే హత్య చేసిన దుండగులు
- గతేడాది అక్టోబర్‌లో మహీధర్‌ను హత్య చేసిన ప్రశాంత్
- ప్రతికారంతో ప్రశాంత్‌ను హత్యచేసిన మహీధర్ బాబాయి కృష్ణారెడ్డి



గతేడాది ప్రశాంత్ హత్య చేసిన మహీధర్



ప్రశాంత్ మృతదేహం

బాపట్ల టౌన్: యువకుడు దారుణహత్యకు గురైన సంఘటన బుధవారం రాత్రి బాపట్ల పట్టణంలో చోటుచేసుకుంది. ఈగల్ బార్ సమీపంలో రోడ్డుపై నిలబడి ఉన్న ప్రశాంత్ (28)ను నెల్లూరుకు చెందిన కొందరు వ్యక్తులు కారుతో ఢీకొట్టి వారి వెంట తెచ్చుకున్న కత్తులతో పొడిచి చంపారు.

మహీధర్‌ను హత్య చేసిన ప్రశాంత్

మృతుడు ప్రశాంత్ అలియాస్ మారి నెల్లూరులోని పెన్నా నది సమీపంలో వైకుంఠపురంలో కార్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తుంటాడు. మృతుడికి సత్యనారాయణపురానికి చెందిన మహీధర్ అనే స్నేహితుడు ఉండేవాడు. అతను కూడా కార్ డ్రైవర్‌గానే జీవనం సాగించేవాడు. ఇద్దరూ గత ఏడాది వినాయకుని నిమజ్జనం సమయంలో గొడవపడ్డారు. అప్పట్లో పెద్దల సమక్షంలో రాజీ కుదిర్చారు. అయినప్పటికీ కోపం తగ్గని ప్రశాంత్ మహీధర్‌ను ఎలాగైనా చంపాలని నిర్ణయించుకున్నాడు. గత ఏడాది అక్టోబర్ 18న రాత్రి నెల్లూరులోని సత్యనారాయణపురం జరిగిన స్నేహితుడి పుట్టిన రోజు వేడుకల్లో ప్రశాంత్ అలియాస్ మారి, మహీధర్, రామ్‌చరణ్‌లు కలిసి మద్యం తాగారు. దాని మత్తులో ఉన్న మహీధర్‌ను ప్రశాంత్, రామ్‌చరణ్‌లు వారి వెంట తెచ్చుకున్న కత్తులతో పొట్టలోని పేగులు బయటకు వచ్చేలా పొడిచారు. దీంతో మహీధర్ అక్కడికక్కడే మృతి చెందాడు. హత్యకేసులో జైలుకెళ్లిన ప్రశాంత్ బెయిల్‌పై బయటకు వచ్చినప్పటి నుంచి మహీధర్ బాబాయి కృష్ణారెడ్డి అతడ్ని హతమార్చేందుకు ప్లాన్ చేస్తూనే ఉన్నాడు.

పథకం ప్రకారమే ప్రశాంత్ హత్య

బెయిల్‌పై బయటకు వచ్చిన ప్రశాంత్ అలియాస్ మారి... మహీధర్ బాబాయి కృష్ణారెడ్డి వల్ల తనకు ప్రాణహాని ఉందని తెలుసుకొని అతన్ని కూడా హతమార్చేందుకు పలు సందర్భాల్లో ప్రయత్నించాడు. దీన్ని మనస్సులో పెట్టుకున్న కృష్ణారెడ్డి, ప్రశాంత్ స్నేహితుడిని ఇన్‌ఫార్మర్‌గా పెట్టుకున్నాడు. బుధవారం ప్రశాంత్ తండ్రిని కలిసేందుకు బాపట్ల వచ్చాడు. విషయం తెలుసుకున్న కృష్ణారెడ్డి ప్రశాంత్ స్నేహితుడితో ఫోన్‌లో మాట్లాడించి బాపట్లకు మరి కొందరితో కలసి చేరుకున్నాడు. పట్టణంలోని ఈగల్ బార్ అండ్ రెస్టారెంట్ సమీపంలో రోడ్డుపై ఉన్నట్లుగా సమాచారం తెలుసుకొని కారుతో ఢీకొట్టి, వెంట తెచ్చుకున్న కత్తులతో విచక్షణారహితంగా పొడిచారు. దీంతో ప్రశాంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పట్టణ సీఐ యు. శ్రీనివాసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల అదుపులో నిందితులు

బాపట్ల నడిబోడ్డున జరిగిన యువకుడి దారుణ హత్య సంచలనం సృష్టించింది. హత్యకు పాల్పడిన వ్యక్తులు అనంతరం అదే కారులో చీరాల వైపు వెళ్తూ మార్గంమధ్యంలో వెదుళ్లపల్లి సమీపంలో కారు నిలుపుదల చేసి పంట పొలాల్లోకి పారిపోయారు. రక్తపు మరకలతో పొలాల్లోకి పారిపోవడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. హంతకుల్ని అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

క్లుప్తంగా

డివైడర్‌ను ఢీకొట్టిన కారు వ్యక్తి మృతి

అద్దంకి: కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందారు. ఈ సంఘటన మండలంలోని అద్దంకి-నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారిలోని చక్రాయపాలెం గ్రామ సమీపంలో గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే..హైదరాబాద్‌లోని కొండాపూర్‌కు చెందిన భానూ శరత్‌శర్మ ఒంగోలులోని స్నేహితుడ్ని కలిసేందుకు కారులో ఒంగోలు బయలుదేరారు. మండలంలోని చక్రాయపాలెం గ్రామ సమీపంలోకి రాగానే అదుపుతప్పి రోడ్డు పక్కనున్న దిమ్మెలను ఢీకొట్టడంతో కారు గాల్లోకి లేచి, పొలాల్లోకి పల్టీలు కొట్టింది. ప్రమాదంలో భానూ శరత్‌శర్మకు తీవ్ర గాయాలయ్యాయి. అతడ్ని ఒంగోలులోని వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స చెందుతూ మృతి చెందాడు. బంధువుల సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య


నాగరాజు మృతదేహం

రాజుపాలెం: భార్య అలిగి పుట్టింటికి వెళ్లిందని మనస్తాపానికి గురైన యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని చౌటపాపాయపాలెం పెట్రోల్ బంక్ సమీపంలో బుధవారం రాత్రి జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రెంటచింతల మండలం తుమ్మకోటకు చెందిన శిరమనేని నాగరాజు(32) భార్య కొంత కాలం కిందట అలిగి పుట్టింటికి వెళ్లింది. మనస్తాపానికి గురైన నాగరాజు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహం రెండుగా విడిపోయింది. మృతుడి వద్ద ఆధార్ కార్డు, ఓటరు కార్డు ఉండడంతో నడికూడి రైల్వే ఎస్‌ఐ శ్రీనివాసరావునాయక్ బంధువులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

'దివ్య'మైన ప్రతిభతో రాణింపు

- అంతర్జాతీయ పోటీల్లో దివ్యాంగ క్రీడాకారుడి సత్తా
- ఈ నెల 28 నుంచి జూన్ 3 వరకు చైనాలో అంతర్జాతీయ బీచ్ పారా వాలీబాల్ పోటీలు
- రాష్ట్రం నుంచి పందిళ్లపల్లికి చెందిన పిచ్చుక నాగరాజు ఎంపిక
- చైనా వెళ్లేందుకు దాతల ఆర్థిక సహకారం కోరుతున్న క్రీడాకారుడు


జాతీయ స్థాయి టీంతో నాగరాజు (సర్కిల్‌లో)

వేటపాలెం: మండలంలోని పందిళ్లపల్లికి చెందిన క్రీడాకారుడు పిచ్చుక నాగరాజు దివ్యాంగుల బీచ్ వాలీబాల్ అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. మే 5న చెన్నైలో జాతీయ స్థాయి మెన్స్ దివ్యాంగ వాలీబాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో రాష్ట్రం నుంచి నాగరాజు అంతర్జాతీయ పోటీలకు ఎంపియ్యాడు. ఈ నెల 28 నుంచి జూన్ 3 వ తేదీ వరకు చైనాలో అంతర్జాతీయ బీచ్‌వాలీబాల్ పోటీలు జరగనున్నాయి. అయితే, పేద కుటుంబంలో జన్మించిన నాగరాజు ఈ పోటీలకు వెళ్లేందుకు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. పోటీలకు వెళ్లడానికి రూ. 2.25 లక్షలు ఖర్చవుతుందని, దాతలు అర్థిక సహకారం అందించాలని కోరుతున్నాడు.

జాతీయ స్థాయిలో మూడుసార్లు సత్తా

నాగరాజు చిన్నతంలోనే ప్రమాదవశాత్తు ఒక చెయ్యి కోల్పోయాడు. అయితే, చిన్నతనం నుంచి వాలీబాల్‌పై మక్కువ. పట్టుదలతో నేర్చుకున్నాడు. స్కూల్, కాలేజీ స్థాయిల్లో పలు పోటీల్లో పాల్గొన్నాడు.

- తొలుత హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో రాష్ట్రస్థాయిలో జరిగిన దివ్యాంగ బీచ్ వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నాడు. 2009లో చెన్నైలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో ఉమ్మడి రాష్ట్రం తరఫున పాల్గొన్నాడు.
- ఆ తరువాత కాంబోడియాలో జరిగిన అంతర్జాతీయ పోటీలకు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు.
- 2010లో రెండోసారి అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. ఇందులో సిల్వర్ మెడల్ సాధించాడు.
- 2011లో జర్మనీలో జరిగిన బీచ్ వాలీబాల్ పోటీల్లో ఇండియా టీంకి వైస్ కెప్టెన్‌గా వ్యవహరించాడు .
- అనంతరం బెంగుళూరులో జరిగిన శ్రీలంకతో జరిగిన ఫ్రెండ్లీ వాలీబాల్ పోటీల్లోనూ పాల్గొన్నాడు.
- అనంతరం ఆర్థిక ఇబ్బందులతో పోటీల్లో పాల్గొనడం నిలిపివేశాడు. 2013లో జరిగిన వాలీబాల్ పోటీల్లో రాష్ట్రం తరుపున జాతీయ పోటీలకు ఎంపికై నాలుగో స్థానం సాధించాడు.

దాతలు సహకారం అందించాలి



చైనాలో జరగనున్న జాతీయ స్థాయి బీచ్ వాలీబాల్ పోటీల్లో పాల్గొనేందుకు రూ. 2.25 లక్షలు ఖర్చవుతుంది. నాకు అంత ఆర్థిక స్తోమత లేదు. దాతలు సహకారం అందించాలి. ఆర్థిక సహకారాన్ని అందించే దాతలు 8712165734ను సంప్రదించాలి.

– పిచ్చుక నాగరాజు

పోలీసుల వైఫల్యం వల్లే పల్నాడులో హింస

వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి బాలహనుమంతరెడ్డి

నరసరావుపేట: పోలింగ్ రోజున పల్నాడు జిల్లా వ్యాప్తంగా జరిగిన హింసకు పోలీసు అధికారులే బాధ్యత వహించాలని వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చీఫ్ ఎలక్షన్ ఏజెంట్ కాకుమాను బాలహనుమంతరెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నరసరావుపేట నియోజకవర్గంలో పలుచోట్ల హింసాత్మక సంఘటనలు జరిగే అవకాశం ఉందని తాను ముందుగానే జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్‌లకు వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోలేదన్నారు. ప్రజలు ప్రశాంతంగా ఓటువేసే పరిస్థితులు కల్పించడంలో విఫలమయ్యారన్నారు. డాక్టర్ గోపిరెడ్డి గృహంపై టీడీపీ వర్గీయుల దాడిలోనూ వారి నిఘా వైఫల్యం స్పష్టమవుతోందని చెప్పారు. దాడి జరిగిన 72 గంటలవుతున్నా ఏ పోలీసు అధికారి వచ్చి పరిశీలించలేదన్నారు. పోలింగ్ రోజున గోపిరెడ్డిని మధ్యాహ్నం 2 గంటలకు హౌస్ అరెస్టు చేసి సాయంత్రం వరకు టీడీపీ అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబును బూత్‌ల చుట్టూ తిరిగే అవకాశం కల్పించడంలోనే వారి పక్షపాత ధోరణి తెలుస్తోందని తెలిపారు. డాక్టర్ గోపిరెడ్డిని అరెస్టు చేసేముందు కనీసం సీఆర్‌పీసీ 41 నోటీసు కూడా ఇవ్వలేదన్నారు. పైగా దాడి చేసిన వారిపై కేసులు నమోదుచేసి వదిలేశారన్నారు. అల్లర్లు జరుగుతున్నప్పుడు ఎంపీ అభ్యర్థి డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్ 10సార్లు ఫోన్ చేసినా ఎస్పీ స్పందించలేదని చెప్పారు. టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు అనేక కార్ల కాన్వాయ్‌తో తిరుగుతుంటే ఎందుకు నిలువరించలేదని ప్రశ్నించారు. లావు శ్రీకృష్ణదేవరాయలు భార్య, జిల్లా ఎస్పీ బిందుమాధవ్ భార్య బంధువులని, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సహకారంతో ఆయన ఇక్కడకు జిల్లా ఎస్పీగా వచ్చారని తెలిపారు. సస్పెండైన వీరాస్వామి అనే సీఐను మాచర్లలో ఏ విధంగా నియమించారని ప్రశ్నించారు. డాక్టర్ చదలవాడ గృహంలో పెట్రోలు బాంబులు, రాళ్లు స్వాధీనం చేసుకున్నారని, ఫినోలెక్స్ అనే కన్సల్టెన్సీ ద్వారా 40మంది బౌన్సర్లను హైదరాబాదు నుంచి తెప్పించి దాడులకు తెగబడ్డారని వివరించారు. ఎస్పీ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు 144సెక్షన్ పెట్టి వ్యాపారాలు జరగకుండా నిలిపేశారని తెలిపారు. హింస సంఘటనల్లో అరవిందబాబుతో పాటు నల్లపాటి రాము, దేశిరెడ్డి చిన్నపరెడ్డి, కపలవాయి విజయకుమార్ పాల్గొన్న విషయం పోలీసులకు తెలిసినా ఎలాంటి చర్యా తీసుకోకపోవడం విస్మయం కలిగిస్తోందని తెలిపారు. ఈ విషయంలో పూర్తిగా విఫలమైన డీఐజీ, ఎస్పీపై చర్య తీసుకోవాల్సిందిగా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్టు వివరించారు.


కలెక్టర్, ఎస్పీలకు అందజేసిన వినతిపత్రం కాపీలను చూపుతున్న బాల హనుమంతరెడ్డి

భట్టిప్రోలు మండలంలో భారీ వర్షం


వెల్లటూరులో వర్షాలకు జీవం పోసుకుంటున్న అరటి పిలకలు

భట్టిప్రోలు: మండలంలో గురువారం ఉదయం నుంచి వాతావరణంలో నెలకొన్న అనూహ్య మార్పుతో భారీ వర్షం కురిసింది. తీవ్రమైన ఎండల నుంచి ప్రజలు ఉపశమనం పొందారు. వాతావరణం చల్లబడటంతో ఊపిరి పీల్చుకున్నారు. వర్షంతో రహదారులు జలమయమయ్యాయి. రైతులు సాగుకు సన్నాహాలు చేస్తున్నారు. వర్షాలకు కృష్ణానదీ పరీవాహక లంక గ్రామాల్లోని వాణిజ్య పంటలకు కొంత మేర నష్టం వాటిల్లింది. మునగ చెట్లు నేల వాలాయి. మామిడి, సపోట తోటల్లో పక్వానికి వచ్చిన కాయలు కూడా నేల రాలాయి. అయితే ఇటీవల నాటిన అరటి పిలకలతో పాటు బొప్పాయి, తమలపాకు, కూరగాయలు, ఆకు కూరల పంటలకు వర్షం జీవం పోసింది. రోహిణీ కార్తె రాక ముందే పరిస్థితి ఇలా ఉంటే.. రానున్న రోజుల్లో ఎండ తీవ్రంగా ఉంటుందా ? అనే సందిగ్ధంలో ప్రజలున్నారు.

ఆలయాలకు పెరిగిన ఆదాయం

అధికంగా పలికిన కౌలు వేలం పాటలు


పంగులూరు వేణుగోపాలస్వామి ఆలయ సమీపంలో నిర్వహిస్తున్న వేలం

జే.పంగులూరు: మండలంలోని పంగులూరు వేణుగోపాలస్వామి దేవస్థాన భూములు, వీరేశ్వర స్వామి, భీమలింగేశ్వరస్వామి వార్ల దేవస్థాన భూములకు ఈవో యు. శ్రీనివాసరావు గురువారం వేణుగోపాలస్వామి ఆలయం సమీపంలో కౌలు వేలం పాట నిర్వహించారు. మూడేళ్లకు గానూ జరిగిన పాటలో ఈ ఏడాది గణనీయంగా పెరిగింది. గ్రామంలో వేణుగోపాలస్వామి దేవస్థానానికి 14.61 ఎకరాల భూమి ఉంది. గతంలో ఈ భూమికి సంవత్సరానికి గానూ కౌలు రూ. 93 వేలు వేలు కాగా, ప్రస్తుతం రూ.1.19 లక్షలకు పలికింది. వీరేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన 25 ఎకరాలకు గతంలో రూ.2.64 లక్షలుకాగా, ప్రస్తుతం రూ. 4.65 లక్షలు పలికింది. భీమలింగేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన 47.28 ఎకరాలకు గతంలో రూ. 6.70 లక్షలు కాగా ప్రస్తుతం రూ.12.51 లక్షలు కౌలు పలికింది.

వాసవీమాత జన్మదిన వేడుకలు ప్రారంభం


ప్రత్యేక అలంకారంలో శ్రీవాసవి అమ్మవారు

తెనాలి: స్థానిక బోసురోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారి జన్మదిన వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. మూడురోజులపాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా తొలిరోజున ఉదయం 5.30 గంటలకు సుప్రభాత సేవ ప్రాతఃకాల అర్చనలు నిర్వహించారు. దేవస్థాన ప్రాంగణంలో వైశ్య పతాకాన్ని ఆవిష్కరించారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, వాసవి ఉత్సవమూర్తికి పంచామృత అభిషేకం జరిపించారు. వాసవి అమ్మవారి మూలమూర్తికి దుర్గాదేవి అలంకారం చేసి, సహస్ర కుంకుమార్చనలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు నుదురుపాటి రామకోటేశ్వర శర్మ జరిపించారు. ఉత్సవాలలో భాగంగా శుక్రవారం అమ్మవారికి లక్ష మల్లెపూల పుష్పార్చన జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం అమ్మవారి పుట్టిన రోజున పూజాది కార్యక్రమాలు, అలంకారాలు, కుంకుమార్చన, హోమాలు, విశేష అర్చనలు, అభిషేకాలు ఉంటాయని వివరించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ జరుగుతుందని వెల్లడించారు. ఉత్సవాలను దేవస్థాన పాలకవర్గ అధ్యక్షుడు నూకల వెంకట వేణుగోపాలరావు, కార్యదర్శి బూర్లె నరసింహారావు, పాలకవర్గ సభ్యులు పర్యవేక్షించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, ఆర్యవైశ్య ప్రముఖులు వుప్పల వరదరాజులు, మద్దాళి శేషాచలం, గొడవర్తి సాయి హరేరామ్, నూకల భాస్కరరావు, ఆకి అచ్యుతరావు, గోపు రామకృష్ణ, గ్రంధి విశ్వేశ్వరరావు, కొణిజేటి శంకరరావు, అన్నవరపు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి

డీటీసీ షేక్ కరీమ్

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): విద్యా సంస్థలకు సంబంధించి పాఠశాల, కళాశాలల బస్సుల ఫిట్‌నెస్ గడువు ఈనెల 15తో ముగిసిందని, రెన్యూవల్ చేయించుకోవాలని డీటీసీ షేక్ కరీమ్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 1500లకుపైగా విద్యా సంస్థల బస్సులు కచ్చితంగా 32 నిబంధనలు పాటిస్తూ ఫిట్‌నెస్ కలిగి ఉండాలని వెల్లడించారు. పాఠశాల బస్సు డ్రైవర్ 60 సంవత్సరాల వయో పరిమితి దాటిన వ్యక్తి అయితే అనర్హుడని పేర్కొన్నారు. డ్రైవర్ ప్రతి మూడు నెలలకొకసారి కచ్చితంగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, ఆ రికార్డులు భద్రపరచాలని వివరించారు. డ్రైవర్ల నియామకాన్ని ఆర్టీఓ అధికారులకు తెలియజేయడంతోపాటు, ఐదేళ్ల అనుభవం, హెవీడ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని సూచించారు. పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ విద్యార్థుల తల్లిదండ్రులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు, ప్రతినెలా వాహనానికి సంబంధించి స్థితిగతులను నమోదు చేయాలని తెలిపారు. బస్సులో అత్యవసర ద్వారం, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, అగ్నిమాపక పరికరం, బ్యాగులు భద్రపరుచుకునే బాక్స్‌లు తప్పనిసరిగా ఉండాలని వెల్లడించారు. విద్యా సంస్థల యాజమాన్యాలు తప్పనిసరిగా వాహనాలను సరైన కండీషన్‌లో ఉంచుకుని రూల్ 185 (జీ) నిబంధనల ప్రకారం తప్పనిసరిగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాలని సూచించారు. ఫిట్‌నెస్ లేని బస్సులను ఎట్టి పరిస్థితుల్లోనూ తిప్పకూడదని స్పష్టం చేశారు. అలా తిరిగే వాహనాలు సీజ్ చేయడంతోపాటు, కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రెండు వర్గాల ఘర్షణ.. 11 మంది అరెస్టు

గుంటూరు ఈస్ట్: రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగిన నేపథ్యంలో గాయపడిన బాధితుడి ఫిర్యాదు మేరకు గురువారం నగరంపాలెం పోలీసులు 11 మందిని అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. కేవీపీకాలనీలో పాత కక్షల నేపథ్యంలో మంగళవారం పరస్పర దాడి చేసుకున్నారు. ఘర్షణలో షేక్ మునాఫ్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడి ఫిర్యాదు మేరకు పోలీసులు బండారు ప్రభు, కారసాల కోటేశ్వరరావు, బత్తుల అశోక్, మరో తొమ్మిది మందిని అరెస్టు చేశారు.

నిడుముక్కల సర్పంచ్‌పై దాడి చేసిన 11 మందిపై అట్రాసిటీ కేసు

తాడికొండ: తాడికొండ మండలం నిడుముక్కల సర్పంచ్ మాదాసు రత్నకుమారిని కులం పేరుతో దూషించి ఆమె, ఆమె సామాజిక వర్గంపై దాడిచేసిన ఘటనలో టీడీపీ వార్డు మెంబర్ నాగ స్వరూపతోపాటు మరో 10 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ సీహెచ్ ప్రభాకర్ తెలిపారు. తనపై దాడి జరిగిందంటూ నాగ స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు 22 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

క్షయ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కృషి

యడ్లపాడు: వచ్చే ఏడాది నాటికి క్షయ (టీబీ)వ్యాధి రహిత రాష్ట్రంగా చేయాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించేందుకు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆరోగ్య కేంద్రాల్లో బీసీజీ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. అర్జునరావు పిలుపునిచ్చారు. యడ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పీహెచ్‌సీలోని అన్ని వ్యాక్సిన్ల నిల్వలను పరిశీలించారు. అవి సరిపడా ఉన్నాయా లేదా ? అనే విషయాలపై ఆరా తీశారు. అక్కడ నుంచి వంకాయలపాడు గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించారు. స్థానిక ప్రజలను కలిసి క్షయ వ్యాధి లక్షణాలు, వాటి నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బీసీజీ వ్యాక్సిన్ ప్రయోజనాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. 18-60 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన వారు, ఐదేళ్లలో క్షయ వ్యాధికి గురైన వ్యాధిగ్రస్తుల కుటుంబీకులను బాడీమాస్ ఇండెక్స్ తక్కువగా ఉన్న, పొగతాగడం అలవాటు గత మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఈ వ్యాక్సిన్లు వేస్తున్నట్లు వెల్లడించారు. మండల పరిధిలో 464 మందికి బీసీజీ వ్యాక్సిన్లు వేసేందుకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. 16వ తేదీ నుంచి వ్యాక్సిన్లు వేయడం జరుగుతుందన్నారు. 2025 నాటికి పూర్తిగా క్షయవ్యాధిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ బి గీతాంజలి, యడ్లపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం ప్రభాకరరావు, డాక్టర్ బి భరద్వాజ, సీహెచ్‌వో ఎస్ పున్నారావు, సూపర్‌వైజర్లు వి రాజశేఖర్, బి గంగానమ్మ, ఆరోగ్య పర్యవేక్షకులు, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

కొత్త సిలబస్‌పై శిక్షణను వినియోగించుకోవాలి


పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, జనవిజ్ఞానవేదిక ప్రతినిధులు

గుంటూరు ఎడ్యుకేషన్: వచ్చే విద్యాసంవత్సరం నుంచి సీబీఎస్ఈ సిలబస్‌లో రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తెస్తున్న పదో తరగతి నూతన పాఠ్యాంశాలపై ఈనెల 19న నిర్వహిస్తున్న ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో లాం లోని చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న ఓరియెంటేషన్‌కు సంబంధించిన పోస్టర్లను గురువారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో విడుదల చేశారు. ఈసందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఫిజికల్ సైన్స్, బయాలాజికల్ సైన్స్, సోషల్ స్టడీస్‌తో పాటు ఇంగ్లీషు సబ్జెక్టుల పాఠ్య పుస్తకాలపై నిష్ణాతులైన ఉపాధ్యాయులతో శిక్షణ ఇవ్వనున్నట్టు వివరించారు. పేర్లు నమోదు చేసుకునేందుకు 99480 15701 నంబర్లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జనవిజ్ఞానవేదిక ప్రతినిధులు టీఆర్ రమేష్, బి.ప్రసాద్, జి. వెంకటరావు, టీఆర్ చాందిని, జీవీవీ సుబ్బారాయుడు, బి. ఉదయభాస్కర్, బి. శంకర్‌సింగ్, ఎం. ఉదయభాస్కర్, ఎస్ఎం సుభాని, ఈ.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నివారణకే అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్



మంగళగిరి : క్షయ వ్యాధిని పూర్తిస్థాయిలో నివారించే లక్ష్యంతోనే అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్నట్లు రాష్ట్ర నోడల్ ఆఫీసర్ ఈ ప్రశాంత్ తెలిపారు. పట్టణంలోని గణపతినగర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో గురువారం అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్‌ను డాక్టర్ ప్రశాంత్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ 18 సంవత్సరాలు పైబడిన వారికి, పొగతాగేవారికి, షుగర్ వ్యాధి గ్రస్తులకు వ్యాక్సిన్ ఇస్తున్నట్టు వెల్లడించారు. ఆశా వర్కర్లు ఇంటింటికీ వెళ్లి అర్హులను గుర్తిస్తున్నారని వివరించారు. ప్రతి గురువారం ఆరోగ్య కేంద్రాలలో వ్యాక్సిన్ వేస్తారని తెలిపారు. అర్హులంతా వ్యాక్సిన్ వేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి. అనూష, డీటీసీఓ డాక్టర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

గణపతినగర్‌లో..

తాడేపల్లిరూరల్: గణపతినగర్‌లో ఇందిరానగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్‌సెంటర్‌లో అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్‌ను స్టేట్ నోడల్ అధికారి డాక్టర్ ఇ.ప్రశాంత్ ప్రారంభించారు.

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు

నరసరావుపేట టౌన్: చెల్లని చెక్కు కేసులో నిందితురాలికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి టి.ప్రవల్లిక గురువారం తీర్పు చెప్పారు. బరంపేటకు చెందిన గొట్టిపాటి చంద్రమౌళి వద్ద చిలకలూరిపేటకు చెందిన షేక్ నాగూర్‌బీ 2020 అక్టోబర్ 10వ తేదీన రూ.5 లక్షలు అప్పుగా తీసుకుంది. చెల్లింపులో భాగంగా ఇచ్చిన చెక్కు చెల్లకపోవడంతో బాధితుడు కోర్టును ఆశ్రయించాడు. నేరం రుజువు కావటంతో న్యాయమూర్తి నిందితురాలికి ఏడాది జైలు శిక్షతోపాటు ఫిర్యాదుదారుడికి రూ.7.5 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.